క్లుప్తంగా

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ రహమాన్

సుల్తానాబాద్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పెద్దపల్లి ఎంవీఐ సిరాజ్ రహమాన్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పట్టణంలోని శాస్త్రినగర్‌లోని డీసీఎం అసోసియేషన్ ఎదుట డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు మద్యం తాగి నడపొద్దని, మద్యం తాగడంతో ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉన్నాయన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ఉపయోగించాలని హితవు పలికారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ సైతం రద్దు చేస్తామని ఆయన డ్రైవర్లకు సూచించారు. అనంతరం రోడ్డు భద్రతా వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న మిత్రులు

ధర్మారం: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ధర్మారం గ్రామానికి చెందిన రూపారాణికి ఆమెతో చదువుకున్న స్నేహితులు మంగళవారం రూ.23వేలు అందించారు. ధర్మారం గ్రామానికి చెందిన రూపారాణి భర్త రాజు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న పదో తరగతి వరకు ఆమెతో పాటు చదువుకున్న స్నేహితులు ఓరం చిరంజీవి, కాల్వ తిరుపతి, కొత్తకొండ సత్యనారాయణ, గందం రాజయ్య, బద్రి మధుసూదన్, బ్రహ్మం ఆర్థికసాయం అందించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



టాస్ వేస్తున్న ఎంపీటీసీ శంకర్

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీటీసీ శీలం శంకర్ అన్నారు. మండలంలోని గట్టెపల్లి జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు క్రీడలు ఏర్పాటు చేయగా మంగళవారం ఎంపీటీసీ ప్రారంభించి టాస్ వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సమ్మిరెడ్డి, పీఈటీ మహేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

25న సమ్మక్క జాతర బహిరంగ వేలం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నీరుకుల్ల–వేగురుపల్లిలో సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా 25న సీల్డు టెండర్ కం బహిరంగ వేలం జాతర ప్రదేశంలో నిర్వహించనున్నట్లు ఏండోమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి శంకరయ్య తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి 24 తేదీ వరకు జరిగే జాతరలో పుట్నాలు, ప్యాలాలు, తల్లి ఆరాధన(కోళ్లు)అమ్ముకోవడానికి ధరావత్ రూ.20వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

కాకర్లపల్లిలో మెడికల్ క్యాంప్



మంథని: మండలంలోని కాకర్లపల్లిలో మంగళవారం మంథని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యబృందం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కొన్నిరోజులుగా గ్రామస్తులు అనారోగ్యాల బారిన పడుతున్నారని మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. కాగా జిల్లా వైద్యాధికారులతో మాట్లాడి గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. వైద్య బృందం గ్రామానికి చేరుకొని అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే మంత్రి సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్నారు.

మైనారిటీ గురుకులంలో ప్రవేశాలు

- 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఫిబ్రవరి 6వ తేదీ ఆఖరు



రంగంపల్లిలోని బాలికల మైనార్టీ గురుకుల పాఠశాల

సుల్తానాబాద్: 2024–2025 విద్యా సంవత్సరానికిగాను తెలంగాణ మైనారిటీ గురుకుల పఠశాలలో 5వ తరగతి, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ జారీ అయ్యింది. పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలోని బాలురకు ఒక పాఠశాల, బాలికలకు రెండు, (పెద్దపల్లి, మంథని) పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి.

అన్ని హంగులతో వసతులు..

మైనారిటీ గురుకులంలో ప్రవేశానికి ఫిబ్రవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఉచితంగా గ్రూప్స్, సివిల్స్ ఎగ్జామ్స్ అవగాహన సదస్సులు, నీట్, ఐఐటీ, ఫౌండేషన్, ఒలంపియాడ్, సీఏ కోచింగ్ కార్పొరేట్ స్కూల్స్‌కి దీటుగా అన్ని రకాల క్రీడలు, ఉచిత నోట్ బుక్స్, టెక్ట్స్ బుక్స్, యూనిఫామ్, షూస్, అన్ని రకాల హంగులతో ఉచిత వసతి, పౌష్టికాహారం అందిస్తుంది.

ఖాళీల వివరాలు..

5వ తరగతిలో ప్రవేశానికి మైనారిటీ విద్యార్థులకు 60 సీట్లు, బీసీ 10, ఎస్సీ 5, ఎస్టీ 3, ఓసీ 2 మొత్తం 80 సీట్లు ఉన్నాయి. కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి మైనారిటీ విద్యార్థులకు 30 సీట్లు, బీసీ 5, ఎస్సీ 2, ఎస్టీ 2, ఓసీ 1 మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్‌లో బాలబాలికలకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీతో పాటు బాలురకు ఒకేషనల్ కోర్సులు కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. అదేవిధంగా ఎలాంటి ఫీజు లేకుండానే ఫిబ్రవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో www.tmreis.telangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన



మైనార్టీ గురుకుల పాఠశాలలో కార్పొరేట్ స్కూలు, కాలేజీలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నాం. 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. వీటితో పాటు 6, 7, 8 తరగతులలో మైనారిటీలు బ్యాక్ లాగ్ సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో పెద్దపల్లి జిల్లా మైనారిటీ గురుకులాల సమన్వయకర్త కార్యాలయంలో సంప్రదించాలి. వివరాలకు 73311 70869 నంబర్‌ను సంప్రదించాలి. – కె.సురేశ్, పెద్దపల్లి, కరీంనగర్, ఆర్‌ఎల్‌సీ (ప్రాంతీయ సమన్వయ కర్త)

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



రాయపేటలో ఎమ్మెల్యే విజయరమణారావును సన్మానిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని రాయపేట శివ పంచాయతన ఆంజనేయస్వామి ఆలయంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా విజయ సాధించడంతో స్వామివారికి 101 కొబ్బరికాయలు కొట్టి అభిషేకం చేశారు. అంతకుముందు ఆలయ చైర్మన్, వైస్‌చైర్మన్ మేకల జనార్దన్‌రెడ్డి, సొల్లేటి భూమిరెడ్డి, అర్చక పూజారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీశ్‌శర్మ, అర్చకులు దూపం సాంబమూర్తి ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేను, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్‌ను, ఎంపీటీసీ రావి సదానందంను సన్మానించారు.

మొక్కు చెల్లించుకున్న అభిమానులు

పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయరమణారావు విజయం సాధించడంతో అభిమానులు కాల్వశ్రీరాంపూర్ మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు రాణవేన సీను, మాజీ ఉప సర్పంచు అల్లం దేవేందర్ యాదవ్, తిరుపతి క్షేత్రానికి వెళ్లి వేంకటేశ్వరస్వామికి తలనీలాలు సమర్పించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ పీఆర్‌వోగా రాజ్‌కుమార్



సుల్తానాబాద్: మండలంలోని గర్రెపల్లికి చెందిన తంగెళ్లపల్లి రాజ్‌కుమార్‌ను రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పీఆర్వోగా నియామకమయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నియామక ఉత్తర్వులు అందజేశారు. రాజ్‌కుమార్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ అధికారులు, సిబ్బంది జట్టుకు, కౌన్సిలర్ల జట్టుకు క్రికెట్ పోటీలను మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి మంగళవారం ప్రారంభించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్ ఉన్నారు.

విద్యార్థులకు సైకిల్ పోటీలు



సైకిల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభించారు. స్థానిక బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలతో పాటు జూపిటర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. 26న విజేతలకు బహుమతి ఇవ్వనున్నట్లు పీడీ సురేశ్ చెప్పారు. సీఆర్పీ తిరుమల, కరస్పాండెంట్ కుమార్ పాల్గొన్నారు.

ముగ్గులపోటీ విజేతలకు బహుమతి ప్రదానం



రామగిరి: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా మండలంలోని కల్వచర్లలో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలుగా నిలిచిన మహిళలకు సోమవారం రాత్రి సర్పంచ్ గంట పద్మ బహుమతి ప్రదానం చేశారు. జీవీఆర్ సేన ఆధ్వర్యంలో ఆర్గనైజర్ డా.శరణ్య ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంపీటీసీ కొట్టె సందీప్, ఉప సర్పంచ్ వేము కనకయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కొలిపాక సారయ్య, మాజీ ఉప సర్పంచ్ ముచ్చకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘పది’ ప్రత్యేక తరగతుల పరిశీలన



మాట్లాడుతున్న తహసీల్దార్ పాషా



విద్యార్థులను ప్రశ్నిస్తున్న తహసీల్దార్ స్వర్ణ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి ప్రత్యేక తరగతులను తహసీల్దార్ జాహెద్ పాషా మంగళవారం సందర్శించారు. విద్యార్థులు పట్టుదలతో ఇష్టపడి చదివి పది జీపీఏ సాధించాలన్నారు. ప్రిపరేషన్ క్లాసులకు ముందు విద్యార్థులకు స్నాక్స్ అందించాలన్నారు. విద్యార్థులు ప్రత్యేక ప్రణాళికతో చదివి వందశాతం ఉత్తీర్ణత పొందాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ ఉదయశ్రీ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎలిగేడు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని తహసీల్దార్ స్వర్ణ అన్నారు. పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్‌గా తహసీల్దార్ స్వర్ణను నియమించడంతో మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలను సందర్శించి, పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు తెలుగు సబ్జెక్ట్‌లో నగరగీతం పాఠం వివరంగా బోధించి, పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. తహసీల్దార్ వెంట హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైకల్యం విజయానికి అడ్డుకాదు



సర్టిఫికెట్ అందజేస్తున్న రేకులపల్లి శశాంక

సుల్తానాబాద్: విజయానికి వైకల్యం అడ్డుకాదని శ్రీవాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక అన్నారు. పట్టణంలోని శ్రీవాణి కళాశాలలో రిటైల్ సేల్స్ అసోసియేట్, ఘన సొసైటీల ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవాణి కళాశాలలో 10వ తరగతి పూర్తయిన దివ్యాంగులకు వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో పూర్తి చేసిన వారు వివిధ ఉపాధి అవకాశాలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, ట్రైనింగ్ ఇన్‌చార్జి సౌజన్య, ట్రైనర్లు శ్వేత, నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు



ప్రశంసపత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

జ్యోతినగర్: కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రియ విద్యాలయంలో పరాక్రమ్ దివస్ వేడుకల్లో భాగంగా పరీక్ష పే చర్చపై విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతంలోని 14 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యకుమారి బర్మా విజేతలకు బహుమతి అందించారు.

25న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ఎలిగేడు: తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచారకర్తల ఆధ్వర్యంలో ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 25న ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఈ వ్రతంలో పాల్గొనే ఆసక్తిగల జంటలు 95509 69686, 94941 25552 నంబర్లకు సమాచారం అందించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ వ్రతంలో పాల్గొనే జంటలు పూజా సామగ్రి తెల్ల వస్త్రం, కిలో బియ్యం, పొట్టుతీసిన కొబ్బరికాయ ఒకటి, పొట్టు తీయనివి రెండు, సత్యనారాయణస్వామి ఫొటో, పండ్లు, పోకలు 16 చొప్పున, మంగళహారతులు, పంచామృతాలు, పూలు, పండ్లు, 12 తమలపాకులు, రెండు కుడుకలు, రెండు కనుములు కలశం చెంబు, ప్లేటు తీసుకుని రావాలని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొనే భక్తులకు తీర్థప్రసాదం, అన్నదానం ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని వారు కోరారు.

దుమ్ము రాకుండా రక్షణ చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందిస్తున్న గ్రామ ప్రజలు, నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3, సీహెచ్‌పీ నుంచి వచ్చే దుమ్ము వీర్లపల్లి గ్రామానికి రాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ గుర్ల మల్లికార్జున్ సింగరేణి అధికారులను కోరారు. మంగళవారం గ్రామ ప్రజలతో కలిసి ఓసీపీ–3 సీహెచ్‌పీ ఇన్‌చార్జి సదానందంకు వినతిపత్రం అందించారు. ఓసీపీ–3, ఓబీ మట్టి డంపింగ్ దుమ్ము, బ్లాస్టింగ్ సమయంలో వచ్చే దుమ్ము, సీహెచ్‌పీ ప్లాంట్ నుంచి వస్తున్న కోల్ డస్ట్, దుమ్ము ద్వారా గ్రామ ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఆసుపత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం లేచేసరికి గ్రామంలోని ఇళ్లపై, వస్తువులపై విపరీతమైన దుమ్ము పేరుకుపోయి ఉంటోందని వాపోయారు. దుమ్ము రాకుండా తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన అధికారులు దుమ్ము రాకుండా ఉండేందుకు నివారణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఏఐటీయూసీ ఆర్జీ–2 అధ్యక్షుడు కె.సురేశ్, కాంగ్రెస్ నాయకులు సమ్మయ్య, కనకరాజు, అన్నారావు, రాజయ్య, ఎల్లయ్య, రమేశ్, మొండి, కుమార్, సతీశ్, రాజు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

కొలనూర్ జాతర చైర్మన్ పదవికి పోటీ

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో జరిగే సమ్మక్క–సారలమ్మ జాతర చైర్మన్ పదవి కోసం పోటీ నెలకొంది. కొలనూర్ అల్లిమాసాని చెరువు సమీపంలో జిల్లాలోనే అత్యంత వైభవంగా జరిగే సమ్మక్క జాతర చైర్మన్ పదవి కోసం 8 మంది పోటీ పడుతున్నారు. జాతర కమిటీ ఎంపిక కోసం ఇటీవల కాంగ్రెస్ నాయకులు, కుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్‌కు చెందిన 8మంది నాయకులు పోటీ పడుతున్నారు. సభ్యులుగా 15 మంది పోటీలో ఉన్నారు. చైర్మన్ పదవి కోసం ఎమ్మెల్యే ఆశీస్సులు పొందాలని ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో జాతర చైర్మన్, డైరెక్టర్లను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి



పెద్దపల్లిరూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు



సుల్తానాబాద్: ఐపీఎస్ పాఠశాలలో..



కాల్వశ్రీరాంపూర్: మంగపేటలో..



కమాన్‌పూర్‌లో..

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద మంగళవారం ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు శివంగారి సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి మంగళవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, సర్పంచ్ ఆకుల ఓదెలు, శ్రీనివాస్, ఇక్బాల్, సుమన్, నర్సయ్య, సత్యం, కుమార్ పాల్గొన్నారు. టీపీయూఎస్ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సుభాస్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వీవైఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు అమరగాని ప్రదీప్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏబీవీపీ కళాశాల కన్వీనర్ మారం ఓంప్రకాశ్, శ్రావణ్, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పట్టణంలోని ఐపీఎస్ పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు, డిబేట్ నిర్వహించారు. చిన్నారులు చంద్రబోస్ వేషధారణలో అలరించారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మంగపేటలో ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

జాతీయస్థాయి నంది పురస్కారానికి ఎంపిక



శ్రీనివాస్‌బాబు

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన చెల్లోజు శ్రీనివాస్‌బాబు(రూపం ఆర్ట్స్) చిత్రకళారంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు తెలుగు, వెలుగు నంది జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ వలబోజు మోహన్‌రావు, కోఆర్డినేటర్ పోలోజు రాజ్‌కుమార్ సమాచారం అందించినట్లు చల్లోజు శ్రీనివాస్‌బాబు తెలిపారు. యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు 2024 సందర్భంగా ఫిబ్రవరి 4న హన్మకొండలో టీఎన్జీవో భవనంలో జరిగే ఉత్సవాల్లో ఈ పురస్కారం అందుకోనున్నట్లు శ్రీనివాస్‌బాబు పేర్కొన్నారు.

పెద్దపల్లిలో జాంబవ చక్రవర్తి విగ్రహ ఏర్పాటు



పెద్దపల్లిరూరల్: పట్టణంలో ఆది జాంబవ చక్రవర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు మాదిగ శక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ తెలిపారు. విగ్రహ తయారీ దాదాపుగా పూర్తి కావొచ్చిందని పేర్కొన్నారు. త్వరలోనే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని చేపడతామన్నారు. మాదిగశక్తి జిల్లా కన్వీనర్ కల్లెపల్లి రవి, కుక్క అశోక్, మీసాల సాయిలు ఉన్నారు.

తల్లిదండ్రులకు ఆటల పోటీలు

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు సంయుక్తంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పేరెంట్స్ స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు రకరకాల గేమ్స్ నిర్వహించారు. సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, రెండు పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు చంద్రయ్య, శంకరయ్య, హెచ్ఎంలు నరేంద్రచారి, అప్పిడి సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

నాటిన మొక్కలు ఎండకుండా చర్యలు



నర్సరీని పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

సుల్తానాబాద్: పట్టణంలో నాటిన మొక్కలు ఎండకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం సిబ్బందిపై ఉందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న నర్సరీ, హరితహారంలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలకు మున్సిపల్ సిబ్బంది ద్వారా నిత్యం నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.